డొల్లతనం.. తేటతెల్లం..

- అధ్వానంగా జాతీయ రహదారి
- అడుగడుగునా గోతులు
- ప్రయాణానికి అవస్థలు



జాతీయ రహదారిపై గైట్ కళాశాల వద్ద పడిన గోతులు



డివైడర్ పక్కకు చేరిన గోతులలోని తారు, కంకర మిశ్రమం

రాజానగరం: రోడ్లకు మరమ్మతులు చేపట్టేటప్పుడు నాణ్యతా ప్రమాణాలు పాటించడం చాలా అవసరం. అప్పుడే అవి సక్రమంగా ఉండడంతో పాటు నాలుగు కాలాల పాటు పనిచేస్తాయి. కానీ ఇప్పుడు పనుల్లో నాణ్యత కొరవడింది. పనులు చేసిన ఏడాది తిరగకుండానే మళ్లీ సమస్య మొదలవుతోంది. ముఖ్యంగా రోడ్ల మరమ్మతుల సమయంలో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. అవి కూడా మారుమూల గ్రామాలలో కాదు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే జాతీయ రహదారిపై కూడా మరమ్మతులు సక్రమంగా చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ప్రయాణమంటే హడలే..

జాతీయ రహదారిపై వాహనాలు నిర్ణీత వేగంతో సర్రున దూసుకుపోవచ్చు. ఒక కార్లలో అయితే వేగంగా, సుఖంగా గమ్యస్థానాలను చేరుకోవచ్చు. ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు ఉండవు కాబట్టి బ్రేక్ తొక్కే అవసరమే ఉండదు. కానీ ఇవన్నీ గతంలో అనుకునే మాటలు. ఇప్పుడు జాతీయ రహదారిపై అడుగుకు ఒక గుంత పడింది. వాహనాలు నడపటానికి డ్రైవర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వేగంగా దూసుకుపోవాల్సిన రోడ్డులో వాహనం నడపడమే కష్టంగా మారిందని వాపోతున్నారు. జాతీయ రహదారిపై ప్రయాణమంటేనే జనం హడలిపోతున్నారు. రహదారికి చిల్లులు పడ్డాయా అన్నట్టుగా అడుగడుగునా గోతులు ఉంటున్నాయి. వేగంగా వెళ్లే వాహనం టైర్లు ఒక్కసారిగా గోతుల్లో పడి ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి.

తరచూ మరమ్మతులు

జాతీయ రహదారిపై గోతులను పూడ్చుతూ సంబంధించి సిబ్బంది ఎప్పుడూ కనిపిస్తారు. నిత్యం ఏదో ఒకమూల మరమ్మతులు జరుగుతూనే ఉంటాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రహదారిపై తారు, కంకర మిశ్రమాన్ని పొరలు పొరలుగా పోస్తూ రహదారికి మెరుగులు దిద్దుతున్నారు. కానీ ఈ పనులలో నాణ్యత లోపించడంతో కొద్ది రోజులకే మళ్లీ మామూలు స్థితికి వచ్చేస్తున్నాయి. వర్షాలు కురిసినప్పుడు గోతులలో తారు, కంకర కొట్టుకుపోయి మళ్లీ యథాతథంగా మారుతున్నాయి. సాధారణంగా జాతీయ రహదారిపై బైకులు, కార్లు, లారీలు వేగంగా దూసుకుపోతుంటాయి. వర్షాల కారణంగా రహదారిపై బయట పడిన గోతులను దగ్గరకు వచ్చే వరకు వాటిని గమనించే అవకాశం ఉండడం లేదు. దీంతో వాటిలో పడి వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఒక్కోసారి ప్రమాదాలకు కూడా దారితీసి, ప్రయాణికులు క్షతగాత్రులవుతున్నారు.

నాణ్యత లోపించడమే ప్రధాన కారణం

సాధారణంగా రహదారుల అభివృద్ధి, మరమ్మతు పనులను వేసవిలో చేస్తుంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రావులపాలెం నుంచి తుని వరకు సుమారు 130 కిలోమీటర్ల మేర 16వ నంబరు జాతీయ రహదారి విస్తరించిఉంది. ఈ రహదారిని పర్యవేక్షిస్తూ, మరమ్మతు పనులు చేసే బాధ్యతలను వివిధ కంపెనీలు తీసుకున్నాయి. కాలానుగుణంగా ఆయా కంపెనీలు రహదారి మరమ్మతులతో పాటు డివైడర్లపై నాటిన మొక్కల పెంపకానికి కూడా బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ పనులను తూతూమంత్రంగా చేపట్టడంతోనే సమస్యలు వస్తున్నాయి. టోల్‌ఫీజుల పేరుతో వాహనదారుల నుంచి భారీగా సొమ్ములు వసూలు చేస్తున్న వారు.. రహదారుల నిర్వహణను బాధ్యతాయుతంగా నిర్వర్తించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేసవిలో చేపట్టాల్సిన మరమ్మతులను వర్షాలు కురిసే సమయంలో చేపట్టడం, పనుల్లో నాణ్యత లోపించడంతో చేసిన పనులు ఎక్కువ రోజులు ఉండడం లేదు.

తీవ్ర ఇబ్బంది



జాతీయ రహదారికి చేసే మరమ్మతులలో నాణ్యత లోపించడం వల్లనే తరచూ గోతులు పడుతున్నాయి. నాణ్యత ఉంటే ఇటువంటి సమస్యలకు చాలా వరకు చెక్ పెట్టవచ్చు. కానీ వసూళ్లకు ఆధారపడిన కొందరు అధికారుల వల్ల కాంట్రాక్టర్లు నాణ్యతకు తిలోధకాలిస్తున్నారు. దాని ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– వి.గిరీష్ కుమార్, దివాన్‌చెరువు

వర్షానికి కొట్టుకుపోతున్నాయి



జాతీయ రహదారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి, మరమ్మతులు చేయడం మంచిదే. కానీ రహదారిని కొబ్బరి కోరినట్టుగా గీతలు పెట్టి, దానిపై తారు, కంకర మిశ్రమాన్ని లేయరుగా పోస్తున్నారు. అయితే ఈ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో వర్షాలకు ఆ లేయర్లు కొట్టుకుపోతున్నాయి. దీంతో రోడ్లపై గోతులు దర్శనమిస్తున్నాయి.

– ఆర్.గంగారావు, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

పదేళ్ల పిల్లలకు టీకాలు



కూనవరం పాఠశాలలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: మండలంలో టీడీ వ్యాక్సిన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఏవీకే చైతన్య శనివారం తెలిపారు. పదేళ్ల వయసున్న 472 మంది పిల్లలకు వీటిని వేశామన్నారు. పిల్లలో కఠసర్పి, ధనుర్వాతం వ్యాధులు రాకుండా ఈ టీకా కాపాడుతుందన్నారు. పదేళ్లు ఉన్న పిల్లలు తప్పనిసరిగా వేయించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలోని ప్రభుత్వం, ప్రైవేటు స్కూళ్లకు వైద్య,ఆరోగ్య సిబ్బంది వెళ్లి వ్యాక్సిన్లు వేస్తున్నారన్నారు.

ఆర్వో వాటర్ స్టీల్ ట్యాంకు వితరణ



మోపిదేవిలో దేవస్థానానికి దాతలు అందజేసిన ఆర్వో వాటర్ స్టీల్ ట్యాంకు

మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానానికి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన భక్తులు భీమిరెడ్డి సుధీర్ రెడ్డి, రజిత దంపతులు 2 వేల లీటర్ల సామర్థ్యం గల ఆర్వో వాటర్ స్టీల్ ట్యాంకు వితరణగా అందజేశారు. శనివారం స్వామివార్లను దర్శించుకున్న అనంతరం వాటర్ ట్యాంక్‌ను దేవస్థానం అధికారులకు అందజేశారు.

వేంకటేశ్వరునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో చంద్రేడు వేంకటేశ్వరస్వామి

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైయున్న పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

పెదపూడి: అనపర్తి పాతఊరులో కర్రి అప్పారావు జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల నిర్మాణకర్త డాక్టర్ పోతంశెట్టి రామారెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.జానకిరామారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్ తగ్గింపు అన్యాయం



వేండ్రలో బడ్జెట్ ప్రతులను తగలబెడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెదపూడి: కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఐసీడీఎస్‌కు రూ.300 కోట్లు తగ్గించడం అన్యాయమని అంగన్‌వాడీ కార్యకర్తల మండల నాయకురాలు ఎం.రాజేశ్వరి అన్నారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో వేండ్ర గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బడ్జెట్ ప్రతులను తగలబెట్టారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించకపోవడం వల్ల తమకు సకాలంలో జీతాలు, బిల్లులు అందే పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డైట్ ఛాత్రోపాధ్యాయులకు పుస్తకాల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: డైట్ 2024–26 బ్యాచ్‌లో ప్రతిభ కలిగిన 20 మంది ఛాత్రోపాధ్యాయులకు విద్యా వికాస్ సొసైటీ ఆధ్వర్యంలో దాత, యూనియన్ బ్యాంకు విశ్రాంత మేనేజర్ ముత్యాల సూర్యనారాయణ పుస్తకాలు పంపిణీ చేశారు. ఒకొక్కరికి రూ.వెయ్యి విలువైన పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ మిడియం బాబూరావు హాజరయ్యారు. ప్రతిభను ప్రోత్సహించడమే తమ సొసైటీ లక్ష్యమని, సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ముత్యాల సూర్యనారాయణ దాతృత్వంతో నిర్విఘ్నంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో మొక్కలు నాటుతున్న దృశ్యం



తొకాడ పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం



పందలపాక ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి

రాజానగరం: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ విద్యార్థులకు సూచించారు.శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా తొకాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులతో కలసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. వాటి సంరక్షణ బాధ్యతను కూడా విద్యార్థులకే అప్పగించారు. ప్రతి పాఠశాలలోను ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి, పర్యావరణ సంరక్షణపై విద్యార్థులను, వారి తల్లిదండ్రులను చైతన్యపర్చాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్బులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సమితి ఏర్పాటు

సీతానగరం: శిక్ష సప్తాహ్‌లో భాగంగా సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో శనివారం పర్యావరణ పరిరక్షణ సమితి (ఎకో క్లబ్)ని ఏర్పాటు చేశారు. దీని ముఖ్య ఉద్దేశం, లక్ష్యాలను విద్యార్థులకు పీడీలు సింహాద్రి, శంకరరావు అవగాహన కల్పించారు. నీరు, భూమి, గాలి, శక్తి వనరులు వినియోగం వంటి విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో 8వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఎకో క్లబ్ కన్వీనర్‌గా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కన్నూరి సతీష్ బాబు, కో ఆర్డినేటర్‌గా సైన్స్ ఉపాధ్యాయుడు తమ్మయ్య, విద్యార్థుల నుంచి టీమ్ లీడర్‌గా జి.దుర్గాదేవి ఎన్నికయ్యారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

బిక్కవోలు: మొక్కలు నాటడం అందరి బాధ్యతని స్థానిక సూరారెడ్డి నర్సింగ్‌హోమ్ అధినేత డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పందలపాక ఉన్నత పాఠశాల వద్ద ఆయన ఎకోఫ్రెండ్లీ క్లబ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి, ఉపాధ్యాయులు, ఎకో ఫ్రెండ్లీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి



కొంకుదురులో కలాంకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బిక్కవోలు: భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులంతా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కొంకుదురు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పడాల ఈశ్వరరెడ్డి అన్నారు. కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ కలాం అత్యంత సాధారణ స్థాయి నుంచి తన క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో అత్యున్నత స్థాయికి చేరుకున్నారన్నారు. ఇస్రోలో చేరి భారతదేశం గర్వించదగ్గ మిస్సైల్ మ్యాన్‌గా పేరు పొందారన్నారు. భారతదేశపు అత్యున్నత పురస్కారం భారతరత్న పొందడమే కాకుండా భారత రాష్ట్రపతిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణరెడ్డి, అప్పారావు, వలీషా, సుధాకర్‌రెడ్డి, చౌదరి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



శ్రీరంగపట్నంలో నిత్యావసరాలు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్

మధురపూడి: అధిక వర్షాలు, వరదల కారణంగా శ్రీరంగపట్నంలో ఇళ్లు దెబ్బతిన్న వారికి శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎర్రకాలువ, గోదావరి వరద కారణంగా జిల్లాలో 1,421 కుటుంబాలు ముంపునకు గురయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా శ్రీరంగపట్నంలోని ఐదు కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం, ఒక లీటర్ పామాయిల్, కిలో చొప్పున కంది పప్పు, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, మద్దాల రమణ, బుద్దా బాపూజీ, అప్పల నర్సయ్య, వీఆర్వో కర్రి రాజు పాల్గొన్నారు.

ఎంపీటీసీ భర్త మృతి



నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి (ఫైల్)



రామవరంలో అంతిమ యాత్రలో పాల్గొన్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

పెదపూడి: అనపర్తి మండలం రామవరం గ్రామ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యురాలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి భర్త, అనపర్తి మండల వైఎస్సార్ సీపీ కార్యదర్శి, రామవరం పోలింగ్ బూత్ కన్వీనర్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి(61) శనివారం ఉదయం రాజమహేంద్రవరంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ గిరడా గంగాభవానీ, ఎంపీటీసీ సభ్యురాలు గౌతమి, పార్టీ నాయకులు సత్తి సుబ్బిరెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, గొలుగూరి గోవిందరెడ్డి, కర్రి గాంధీరెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి పార్టీలో చురుకైన పాత్ర పోషించారంటూ కొనియాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తరువాత గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, వేధింపులు జరుగుతున్న నేపథ్యంలో సత్యనారాయణరెడ్డి ఆందోళనకు గురై గుండెపోటుతో మృతి చెందినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

కార్గిల్ వీరుల స్ఫూర్తితో పయనిద్దాం



గైట్‌లో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ

రాజానగరం: కార్గిల్ యుద్ధ వీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో పయనిద్దామని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో కాకినాడ గ్రూప్ ఎన్‌సీసీ 18 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షిక శిక్షణా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ శిబిరం వచ్చే నెల మూడు వరకూ కొనసాగుతుందన్నారు. ఈ శిక్షణకు మూడు జిల్లాల నుంచి 591 మంది ఎన్‌సీసీ విద్యార్థులు హాజరయ్యారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పెదపూడి: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి వైద్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులతో సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు రికార్డులు పరిశీలించారు. ఓపీ ప్రతి రోజు ఎంత ఉంటుందని, ఏ రకాల మందులు అందుబాటులో ఉన్నాయో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమణమూర్తి, వైద్యులు అనూష, వరప్రసాద్, పుట్టా గంగాధర్ చౌదరి, అరుమిల్లి అమ్మన్న చౌదరి, సింగినీడి నాగతిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మిల్క్ మష్రూమ్స్ ప్రదర్శన

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మైక్రో బయాలజీ విభాగం అధ్యాపకులు టి.సోనీ, టి.సుజాతల ఆధ్వర్యంలో విద్యార్థులు మిల్క్ మష్రూమ్స్ పెంపకంపై శనివారం కార్యక్రమం నిర్వహించారు. శిక్షణను పొంది విజయవంతంగా మష్రూమ్స్ పండించి, అధ్యాపకులు విద్యార్థులతో కలిసి ప్రిన్సిపల్ చాంబర్‌లో ప్రదర్శించారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ ఉపాధి నైపుణ్యాలను పెంచేలా విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలను అందించాలన్నారు. టి.సోని మాట్లాడుతూ మిల్క్ మష్రూమ్స్ ఒక అరుదైన జాతి అని, ఇటీవల వీటిపై ప్రజలకు బాగా అవగాహన పెరిగిందన్నారు. వీటిలో ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు, ఎక్కువ ప్రోటీన్లు, విటమిన్లు, పీచు పదార్థం ఉందన్నారు.

ఆరోగ్య మందిరం చుట్టూ అపరిశుభ్రత



మర్రిపూడి ఆయుష్మాన్ మందిరం ఎదురుగా చెత్తాచెదారం

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో గల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం చుట్టూ అపరిశుభ్రత తాండవిస్తోంది. ఈ వైద్యశాలకు చుట్టూ ప్రహరీ, వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేవు. దీనికి తోడు ఆసుపత్రి పక్కనే చెత్తకుప్పలు దర్శనమిస్తాయి. అక్కడే మురుగు నీరు సైతం పారుతుంటుంది. ఇక ఆసుపత్రి సిబ్బంది ఎప్పుడొస్తారో, ఎప్పుడు వెళతారో ఎవరికీ తెలియదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముంపు ప్రాంతాలలో పారిశుధ్య పనులు

ధవళేశ్వరం: రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని ముంపు ప్రాంతాలలో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆమె శనివారం కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఆవ చానల్ నుంచి గోదావరిలోకి పంపుతున్న నీటితో రూరల్ పరిధిలోని పలు ప్రాంతాలు ముంపునకు గురైన విషయం తెలిసిందే. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు పర్యటన చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆర్అండ్‌బీ కల్వర్టు నిర్మాణం, శానిటేషన్ పనులను చేపట్టడంతో పాటు, గోదావరి పరివాహక ప్రాంతం, గట్టు, ఇరిగేషన్ కాలువ ప్రాంతాలలో ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో డి.శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.72 వేల విలువైన ఎరువుల సీజ్



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సీతానగరం: చినకొండేపూడిలోని సిద్ధి వినాయక ఎంటర్ ప్రైజెస్ ఎరువులు, పురుగు మందుల దుకాణంలో శనివారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ఎ.జగన్నాథరెడ్డి, సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిల్వలకు, పుస్తకంలో లెక్కలకు తేడా ఉండడంతో రూ.72 వేల విలువైన ఎరువులను సీజ్ చేశారు. వ్యవసాయశాఖ అనుమతి లేకుండా ఎరువుల గోడౌన్ లో పురుగు మందుల నిల్వ ఉంచడంతో 682.5 కిలోలు, 610 లీటర్ల పురుగుమందును 15 రోజుల వరకు అమ్మకాలు జరపకుండా నిలుపుదల చేశారు. వీటి విలువ రూ.11,34,068 ఉంటుందని తెలిపారు. తనిఖీలో ఏవో భార్గవ మహేష్, పీసీలు వలీ, లోవరాజు, వీరబాబు, సీతానగరం మండల ఏవో సూర్య రమేష్, వీఏఎలు పాల్గొన్నారు.

ఏటిగట్టు పటిష్టతకు చర్యలు చేపట్టాలి



ఏటిగట్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ, వెంకట రమణ చౌదరి

సీతానగరం: ఏటిగట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాలలో పటిష్టతకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రాజానగరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి అధికారులకు సూచించారు. బొబ్బిల్లంక అశోక్ నగర్ వద్ద గోదావరి వరదకు ఏటిగట్టును ఆనుకుని ఉన్న లంకభూమి కోతకు గురైన ప్రాంతాన్ని ఏజీఎల్‌బీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్, ఏఈ శివప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాక్ బౌల్డర్లు వేయకుంటే కోతను నివారించడం కష్టమన్నారు. దీనికి రోడ్డు మార్గం ఏర్పాటు చేసి, రేపటి నుంచి లారీలపై రాక్ బౌల్డర్లను కోతకు గురైన ప్రాంతంలో వేస్తామని తెలిపారు. సుమారు 300 లారీలకు పైగా రాక్ బౌల్డర్లు అవసరమవుతాయన్నారు.

బాలిక అదృశ్యం

పెదపూడి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైందని పెదపూడి ఇన్‌చార్జి ఎస్సై రామకృష్ణ తెలిపారు. గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన బాలిక పెదపూడిలో అమ్మమ్మ ఇంటికి ఈ నెల 25న వచ్చింది. అదేరోజు కొంత సమయం తరువాత మెయిన్‌రోడ్డులోని బేకరీకి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. ఆమె ఎంతకూ తిరిగిరాలేదు. వెంటనే షాపు సమీపంలో వెతకగా కాకినాడ వైపునకు వెళుతున్న ఆటో ఎక్కినట్లు స్థానికులు తెలిపారు. దీంతో బాలిక మేనమామ ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.